www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్


Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు
ఉపకులపతి (FAC)

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వుల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 28 | 10-04-2023 | పుటలు : 4




భారతదేశ రాజ్యాంగ నిర్మాత
డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి
**శుభాకాంక్షలు!!**
- నన్నయవాణి



## మంచిమాట

విద్య అనేది రెండు వైపులా పదునున్న కత్తి. దానిని ఉపయోగించే సమయంలో జాగ్రత్త వహించాలి. వినయము,శీలము లేని విద్యావంతుడు చాలా ప్రమాదకరం.అతని విద్య ప్రజల సంక్షేమాన్ని కుంటుపరిచేదైతే ఆ వ్యక్తి సమాజానికి అనవసరం.విద్య కంటే శీలం గొప్పది.

- డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

# సమష్టి కృషితో నాణ్యమైన ఉన్నత విద్యను అందించాలి

## యాప్షీ వైస్ చైర్మన్ ఆచార్య కె.రామమోహనరావు

**06.04.23 (మీడియాసెల్)**

ఉన్నత విద్యారంగంలో మెరుగైన మార్పులను తీసుకువస్తున్నామని, విశ్వవిద్యాలయాలతో పాటు అనుబంధ కళాశాలలు సమష్టిగా సహకరించి రాష్ట్రంలోని నాణ్యమైన ఉన్నత విద్యను అందించేందుకు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ఆచార్య కె.రామమోహనరావు అన్నారు. గురువారం యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, సెక్రటరీస్ అండ్ కరస్పాండెంట్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ఆచార్య కె.రామమోహనరావు, వీసీ ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు హాజరై నన్నయ విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీడీసీ డీన్ ఆచార్య కె.శ్రీరమేష్ మాట్లాడుతూ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో నుండి 2012 ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి అనుబంధ కళాశాలలు వచ్చాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కళాశాలల అభివృద్ధి ఎంతో సహాయపడుతుందని చెప్పారు. యాప్షీ వైస్ చైర్మన్ ఆచార్య కె.రామమోహన్ రావు మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాలలో నిర్వహించిన ఇండియా స్కిల్స్ రిపోర్ట్ సర్వేలో ఎక్కువ ఇంటర్న్ షిప్ లను చేసిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చెప్పారు. న్యూమరికల్ స్కిల్స్, ఫిమెల్ ఎప్లాయిబులిటీ వంటి విషయాలలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయర్ ఎడ్యుకేషన్ ఉన్నత స్థానంలో ఉండడానికి కారణం అనుబంధ కళాశాలల కృషి అని అన్నారు.కళాశాలలు పరీక్ష ఫలితాలను తులనాత్మక పరిశీలన చేసుకొని అధ్యాపకులతో చర్చించి ఫలితాలను పెంచాలన్నారు. కళాశాలలు భవిష్యత్ లో ఛాయిస్ బేసిడ్ క్రెడిట్ సిస్టమ్ పాఠ్యాంశాలు పూర్తి స్థాయిలో వస్తున్నాయన్నారు. కాబట్టి అన్ని కళాశాలలు దానికి తగిన విధంగా ఫ్యాకల్టీ ప్యానల్ బోర్డులను సిద్దం చేసుకోవాలన్నారు. నేరుగా బోధించే అవకాశాలు లేని పాఠ్యాంశాలను ఆన్లైన్ లో బోధించే విధంగా ప్రణాళికలు సిద్ధ చేసుకోవాలన్నారు. అఫిలియేషన్ కు సంబంధించిన అన్ని సిద్ధం చేసుకుంటూ విజిట్ కు వచ్చినప్పుడు సులభతరం అవుతుందన్నారు. కమ్యూనిటీ సర్వీస్ ప్రోజెక్టు, ఇంటర్న్ షిప్ లు విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. రెండు లక్షల మంది విద్యార్థులకు ఇంటర్న్ షిప్ లను చేసారన్నారు. నేర్చుకోవలన్న తపన విద్యార్థులకు సూచించాలని, గురువులు మార్గనిర్దేశం చేయాలన్నారు. ఆరు నెలల ఇంటర్న్ షిప్ లో లైవ్ ప్రోజెక్టులను చేస్తున్నారని, వీటికి మంచి స్పందన వస్తుందని చెప్పారు. వాటిని లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ లో పెడుతున్నామన్నారు. రాష్ట్ర స్థాయిలో మెకానిజాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇంటర్న్ షిప్ లను ఎంత సమర్థవంతంగా నిర్వహిస్తే విద్యార్థుల భవిష్యత్ అంత సమర్థవంతంగా ముందుకు వెలు తుంద న్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఒకే అకడమిక్ క్యాలెండర్ ను విడుదల చేయనున్నా మని, దానిని యూని వర్సిటీలు, కళాశాలలు పూర్తి స్థాయిలో అమలు పరచాలని సూచించారు. ఫైషియల్ రికగ్నేషన్ సిస్టమ్ (ఎఫ్.ఆర్.ఎస్) లో ప్రతీ విద్యార్థి రిజిస్ట్రార్ అవ్వా లని, ఆన్లైన్ హాజరును పరిగణలోనికి తీసుకొని పరీక్షలకు పంపిస్తామని చెప్పారు. అన్ని పాఠ్యాంశాలను, యాక్టివిటీలను యాప్షీ వెబ్ సైట్ లో పెడతామని వీటిని పరిశీలించి రిపోర్టును ఇవ్వాలన్నారు. సమష్టి సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్టంలో నాణ్యమైన ఉన్నత విద్యకు కృషి చేయాలన్నారు. వీసీ ఆచార్య జి.వి.ఆర్. ప్రసాదరాజు మాట్లాడుతూ అనుబంధ కళాశాలల ఎఫిలియేషన్, ఆన్లైన్ పరీక్షల విధానం వంటి అంశాలను వివరించారు. కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్న ఆన్లైన్ విధానాన్ని జె.ఎన్.టి.యు.కె లో సమర్థవంతంగా నిర్వహించామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి మరియు ఉన్నత విద్యాశాఖ నాణ్యమైన ఉన్నత విద్యకు కృషి చేస్తున్నారని అన్నారు. కళాశాలల్లో వసతులు, వనరులు, సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించి నాణ్యమైన ఉన్నత విద్యను అందించేందుకు కృషి చేయాలన్నారు. సిఎం జగన్మోహనరెడ్డి విద్యార్థుల భవిష్యత్ పై ఉన్నత లక్ష్యాలను కలిగి ఉన్నారని చెప్పారు. దీనిలో భాగంగా విద్యాతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు నూతన విధానాలను విద్యారంగంలో ప్రవేశపెట్టారని చెప్పారు. విద్యార్థులకు నైపుణ్యాల శిక్షణ చాలా అవసరమని గుర్తించి ఇంటర్న్ షిప్ లను, కమ్యూనిటీ సర్వీసులను ప్రవేశపెట్టారని తెలిపారు. యూనివర్సిటీలు పరిశోధనలవైపు దృష్టిసారిస్తున్నాయని, ముఖ్యంగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనలకు అవకాశాలు అధికంగా ఉన్నాయని చెప్పారు. కళాశాలలు అన్ని పూర్తి స్థాయిలో సహకరించి నాణ్యమైన ఉన్నత విద్యను సమాజానికి అందించాలని కోరారు. తరువాత డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డీన్ ఆచార్య. డి.జ్యోతిర్మయి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తరుపున నడపబడుతున్న వివిధ కోర్సుల వివరాలను తెలియజేసారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సూచనలను, యాప్షీ మరియు యూనివర్సిటీ సూచనలను అన్ని కళాశాలలు పాటించాలని కోరారు. ఇంటర్ షిప్, తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. ఈసీ మెంబర్ డా.బి.జగన్మోహనరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్మోహనరెడ్డి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యకు పెద్దపీత వేస్తుందన్నారు. ఇంటర్న్ షిప్ ల ద్వారా విద్యార్థులకు ఎంతో ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేసి అభినందించారు. మధ్యాహ్నం జరిగిన కార్యక్రమంలో స్టేట్ ఇంటర్ షిప్ కోఆర్డినేటర్ దినేష్ రెడ్డి ఎల్.ఎం.ఎస్, కమ్యూనిటీ సర్వీస్ ప్రోజెక్టు, ఇంటర్న్ షిప్ లపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ను అందజేసారు. అలాగే ఆయా కళాశాలల సందేహాలను నివృత్తి చేసారు. ఈ కార్యక్రమంలో సిడిసి డీన్ ఆచార్య కె.శ్రీరమేష్, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, డీన్ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య డి.జ్యోతిర్మయి, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, ఈసీ మెంబర్ డా.బి.జగన్మోహనరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నన్నయ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న యాప్షీ వైస్ చైర్మన్ రామమోహన్ రావు

## సంపాదకీయం



# విజేత

సుదీర్ఘమైన మనదేశ చరిత్రలో ఎందరో మహానుభావులు ఉద్భవించారు. వారి వారి కాలాల్లో తమ కర్తవ్యాలను నిర్వహించారు. సమాజ జీవనంలో అవసరమైన మలుపు తీసుకుని రావటానికి తమకుగల శక్తియుక్తులన్నింటిని దారపోసి ప్రయత్నించారు. సత్వర ప్రయత్నాలను పొందిన, కాలాంతరంలో ఫలితాలు సమకూర్చిన, సమాజ శ్రేయస్సుకు సామరస్యానికి భంగం కలగని రీతిలో నడుపుకుంటూ వచ్చిన వారు ధన్యులు.

భారతదేశపు పునరుజ్జీవనానికి రూపురేఖలు దిద్దిన వారిలో అడుగులు వేసిన మహనీయులు డా. బి. ఆర్. అంబేద్కర్. జీవితాన్ని నిరంతర పోరాటంగా స్వీకరించి తన ప్రజలకోసం, తన సమాజం కోసం, తన దేశంకోసం నిరంతరం తపించిన వ్యక్తి డా. అంబేద్కర్. ఎవరికి ఇవ్వవలసిన మర్యాదను, గౌరవాన్ని వారికి ఇస్తూనే తనకు సంతృప్తికరమైన సమాధానం వచ్చే వరకు రాజీపడని యోధుడాయన.

సునిశిత మేధాశక్తితో సమస్యల్ని అన్ని కోణాలనుంచి అధ్యయనం చేసి సమాజానికి దీర్ఘకాలిక ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని పరిష్కారాన్ని ప్రతిపాదించిన ద్రష్ట అంబేద్కర్. ఆయన జీవితమంతా ఒక అద్భుత చిత్రం. ఒక యజ్ఞం. సమాజానికి సమర్పణం.

అంబేద్కర్ అందరికీ తెలుసు. కానీ ఆయన గురించి తెలిసింది చాలా తక్కువ. ఆయన జీవితాన్ని అధ్యయనం చేసిన వాళ్ళు తక్కువ. కానీ మామూలుగా చదివిన వారు కూడా తక్కువే. కొందరి దృష్టిలో ఆయన విద్యావంతుడు. అయితే ఆ విద్యను, జ్ఞానాన్ని ఎంత కష్టపడి సంపాదించారనేది చాలామందికి తెలియదు. కొందరి దృష్టిలో ఆయన దళిత జన విముక్తి దాత. అయితే అదే సమయంలో తన యావత్తు సమాజంలోని దుర్లక్షణాల గురించి వారి హృదయం ఎంత దుఃఖానికి గురయ్యిందో, యావత్తు సమాజ సంరక్షణకు ఎంతగా తాపత్రయపడ్డారో తెలియదు. కొందరి దృష్టిలో ఆయన రాజ్యాంగాన్ని రూపొందించిన గొప్ప విజ్ఞాన వేత్త. అయితే ఆయన జీవితంలో ఎటువంటి అవమానాలకు, ఈసడింపులకు గురయ్యారో తెలియదు.

ఉన్నతమైన పదవులు అధిష్టించిన కాలంలో కూడా ఆయనను కొందరు ఎలా చిన్నబుచ్చి చూశారో చాలామందికి తెలియదు. ఆయన స్వతంత్ర భారతదేశపు మొదటి మంత్రివర్గంలో సభ్యునిగా తెలుసు. అయితే దేశ విభజన జరిగినప్పుడు మన దేశాన్ని ఎలా రూపొందింప చేయాలని ఆయన ఘోషించారో తెలియదు.

రాజ్యాంగాన్ని రూపొందించే సంరచనా సమితిలో ఏడుగురు సభ్యులు ఉన్నప్పటికీ కొందరికి అనారోగ్యం కారణంగానూ, కొందరికి ఇతర వ్యాపకాలు బాధ్యతలు ఉన్న కారణంగానూ బాధ్యత ప్రధానంగా బాబాసాహెబ్ భుజస్కంధాల మీద పడింది. వివిధ దేశాల రాజ్యాంగాలు అధ్యయనం చేసిన అనుభవంతో రాజ్యాంగ నిర్ణయ సభలో జరిగిన చర్చల్లో దాదాపుగా ప్రతి విషయం మీద ఆయనే సమాధానాలు ఇచ్చారు.

గతంలో పీడితులుగాను, వంచితులుగానూ ఉన్న వర్గాలకు ప్రత్యేక రాయితీలు ఇస్తూ భారతదేశంలో అనుసరిస్తున్న పద్ధతి, దాని వ్యాప్తి, విస్తృతి సమాజంలో వాడుకలో ఉండిన వ్యత్యాసాలను అంతరాలను సూక్ష్మంగా పరిశీలించి భారతదేశ సమానతను మౌలిక ప్రాతిపదికగా అంగీకరించి సమాజంలోని విభిన్న వర్గాల్లో పేరుకుపోయిన హెచ్చుతగ్గు, పేదభావాలను పూర్తిగా తొలగించడానికి భారత రాజ్యాంగంలో నియమాల్ని రూపొందించారు. పర్యవసానంగా పూర్వపు నష్టాలను తొలగించేవి, గాయాలను మాన్పేదయిన అనేక యోజనలను రాజ్యాంగంలో రూపొందించారు అంబేద్కర్.

ఒంటరైపోయిన సమయంలో కూడా తన ప్రతిభతో అందరినుండి గౌరవాన్ని పొందటమేకాక, తన తోటి ప్రజానీక మంతటికి గౌరవాన్ని సంపాదించి పెట్టే పనిలో అంబేద్కర్ దృఢదీక్షతో విజయం సాధించారు. మనిషికి, జంతువుకీ మధ్య తేడా ఉంది. జంతువుకి బ్రతకడానికే ఆహారం అవసరం. కానీ మనిషికి శరీరంతో పాటు చైతన్యవంతమైన మనసు ఉంది. ఈ రెండిటినీ అతడు పోషించాలి. ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాల్సిందేమంటే రోగాలు రాకుండా మనకు ఆరోగ్యవంతమైన శరీరం ఎలా ఉండాలో అలాగే శరీరం ఆరోగ్యంగా ఉండటం కోసం జాగృతి గల మనసుని అభివృద్ధి చేసుకోవాలనీ, మనిషికి సంపూర్ణ వికాసం కావాలనీ అంటారు డాక్టర్ అంబేద్కర్.

అంబేద్కర్ ఒక ప్రవక్త కాదు. ఒద్దికగా తలవంచుకుని కూర్చుని మీరు ఏమి చెప్పినా శిరసా వహిస్తానని భావించే శ్రోతలకు కాదు ఆయన తన ఉపన్యాసాలు వినిపించింది. తాను నిర్దేశించుకున్న లక్ష్యాల మేరకు తన ప్రజల ప్రయోజనాలను సాధించటానికి ఖండన, మండనలు, ప్రశ్నలు, ఎదురు ప్రశ్నలతో కూడిన వాదాలు ఆయన వినిపించవలసి వచ్చింది. తనను సమర్థించే వాడొక్కడు కూడా లేని సభలో ఆయన ప్రసంగించవలసి వచ్చింది. శూన్యం నుండి తన సృజన శక్తిని ప్రదర్శించవలసి వచ్చింది. కాబట్టి ఆయా సందర్భాలకు అవసరమైన పద్ధతిలో తన వాక్చాతుర్యాన్ని వినియోగించి అవతలి వ్యక్తులను తన దారిలోకి తెచ్చుకునే ప్రయత్నం చేశారు.

భారతీయులు కొన్ని వేల సంవత్సరాలుగా ఒక జాతిగా జీవిస్తూ వచ్చారని, అనితరసాధ్యమైన సాంస్కృతిక వారసత్వం కలిగి ఉన్నారని, ఈ జాతి యొక్క జాతీయతకు పునాదులు సంస్కృతిలోనే ఉన్నాయని గాఢంగా విశ్వసించిన వారు అంబేద్కర్. జాతి సేవలో తాను లీనమై ఉన్న తరుణంలో కొన్ని కొన్ని పదవులను ఆయన స్వీకరించినప్పుడు కర్తవ్య భావనతో వాటిని నిర్వహించి కర్తృత్వ శక్తితో ఆ పదవులకు గౌరవాన్ని ఆపాదింపజేసి తాను నిర్దేశించుకున్న కార్యానికి ఆ పదవులు ఆటంకమవుతున్నాయని తోచిన సందర్భంలో సంకోచించకుండా వాటిని త్యజించారు కూడా. తన ఎదురుగా ఉన్న వారిని తన దారికి తెచ్చుకోవడానికి ఒప్పించటానికి ఏ మాట మాట్లాడినా భారతీయులందరూ ఒక జాతిగా ఒక బలియమైన పటిష్టమైన స్వేచ్ఛ సమానత్వ సోదర భావాల ప్రాతిపదికలుగా జీవిస్తూ దేశ ప్రగతిని సాధించాలని నిరంతరం ఆకాంక్షించే వారు.

డాక్టర్ అంబేద్కర్ ను ఎందుకు గౌరవించాలి, ఎలా అనుసరించాలి! అనే పుస్తకాన్ని డా. వడ్డి విజయ సారథి గారు ఇరవైఏళ్ల క్రితం నవనిర్మాణ ప్రచురణల నుండి వెలువరించారు. ఆ పుస్తకాన్ని చదువుతున్నప్పుడు ఈ యుగంలో బుద్ధ భగవానుడికి తగిన వారసుని రూపంలో అంబేద్కర్ నిలిచారేమో అని మనకనిపిస్తుంది. ధర్మం యొక్క స్వరూపాన్ని నిర్మలంగా వినిపించడానికి, సమాజాన్ని సంస్కరించటానికి ఆనాటి సాంఘిక దురాచారాల మీద దాడి చేసి తన ఉద్దేశాన్ని, సంస్కరణ భావాన్ని వ్యక్తం చేస్తూ సమ సమాజ నిర్మాణానికి గొప్పగా కృషి చేసిన వ్యక్తి అంబేద్కర్.

మన దేశానికి, జాతికి వారు చేసిన మహోపకారానికి మనం ఎప్పుడూ ఆయనకు ఋణపడే ఉన్నాం!!

# నన్నయను విజిట్ చేసిన
# సాప్ వైస్ ఛైర్మన్ హర్షవర్ధన్

**08.04.23 (మీడియాసెల్)**



ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని క్రీడా వసతులను, వనరులను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.హర్షవర్ధన్ ఐ.ఎ.ఎస్ పరిశీలించారు. శనివారం రాజమహేంద్రవరంలోని ప్రాంగణాన్ని విజిట్ చేసిన హర్షవర్ధన్ కు వీసీ ఆచార్య జి.వి.ఆర్. ప్రసాదరాజు, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ స్వాగతం పలికారు. యూనివర్సిటీ క్రీడాభివృద్ధిలో భాగంగా ఖేలో ఇండియా నిధులతో నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ పనులను ఆయన పరిశీలించారు. యూనివర్సిటీలోని మరిన్ని క్రీడాభివృద్ధి వసతులకు సంబంధించిన ప్రతిపాదనలను వీసీ, రిజిస్ట్రార్ లు అందజేసారు. ఉమ్మడి గోదావరి జిల్లాలకు కేంద్రమైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో క్రీడావసతులను అభివృద్ధి చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఇంజనీర్, ఈఈ సిద్దయ్య, విశ్వవిద్యాలయ అధికారులు, క్రీడా మరియు ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నన్నయలో బాబు జగజ్జీవన్ రామ్ జయంతి



ఆదికవి నన్నయ యూనివర్సిటీలో స్వాతంత్ర్య సమరయోధుడు సంఘ సంస్కర్త బాబు జగజ్జీవన్ రామ్ 116వ జయంతిని నిర్వహించారు. యూనివర్సిటీ ఈసీ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు జగజ్జీవన్ రామ్ తన చిన్ననాటి నుండి కుల వివక్షతకు గురైనప్పటికీ వాటిని ఎదుర్కొని మంచి విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకుని ప్రపంచ రాజకీయ చరిత్రలో 50 ఏళ్ల సుదీర్ఘ పార్లమెంట్ ప్రస్థానాన్ని కొనసాగిస్తూ అనేక మంత్రి పదవులను అధిష్టిస్తూ భారతదేశ చరిత్రలో తొలి దళిత ఉప ప్రధానిగా బాధ్యతలు నిర్వహించారని కొనియాడారు. బాబు జగజ్జీవన్ రామ్ నుండి విద్యార్థులు నిబద్ధత, కష్టపడి పనిచేసే తత్వం, దేశ అభివృద్ధికై నవ సమాజ స్థాపన కై మనం నిర్వహించిన కర్తవ్యాలను వారి నుండి నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు డా. ఎం గోపాలకృష్ణ, డా. లక్ష్మి, డా. మౌనిక, డా.హర్షారెడ్డి, అధ్యాపకేతర సిబ్బంది మనోహర్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 10న బీఈడీ స్పాట్ అడ్మిషన్స్

**08.04.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరం ప్రాంగణంలో ఈనెల 10వ తేదీన బీఈడీ స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నామని రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ తెలిపారు. శనివారం యూనివర్సిటీలో దీనికి సంబంధించిన వివరాలను రిజిస్ట్రార్ తెలియజేసారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో బీఈడీ కోర్సు అనుభవజ్ఞులైన అధ్యాపకులచే నడపబడుతుందని అన్నారు. పదో తేదీన స్పాట్ అడ్మిషన్స్ ప్రక్రియను డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ వారు నిర్వహిస్తారని తెలిపారు. బీఈడీ ప్రవేశం కొరకు అర్హత ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ 0883-256611 నెంబర్లును సంప్రదించగలరు. ఫీజు తదితర వివరాల కొరకు యూనివర్సిటీ వెబ్ సైట్ www.aknu.edu.in ను సంప్రదించాలని తెలియజేసారు.

# గూడెం క్యాంపస్‌లో జగజ్జీవన్ రామ్ జయంతి



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, తాడేపల్లిగూడెం క్యాంపస్ లో బాబు జగజ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమాన్ని క్యాంపస్ సిబ్బంది నిర్వహించారు. జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ADIKAVI NANNAYA UNIVERSITY
## RAJAMAHENDRAVARAM

No.AKNU/R/Sports/2023-6 Date.06.04.2023

**REVISED CIRCULAR**

This is to inform you all that on the eve of University Foundation Day i.e. on 22nd April. The University is organizing the following sports and games competitions from 13th - 17th April, 2023. All the Teaching and Non-Teaching staff of three campuses (RJY, KKD, TPG) are requested to register their names/teams on or before 10.04.2023. The proposed games and sports are as follows:

| Men | Date & Time | Women | Date & Time |
|---|---|---|---|
| Cricket | 17.04.2023 @ 10AM | 400M Walking | 13.04.2023 @ 2PM |
| Volleyball | 15.04.2023 @ 2PM | Carroms (Doubles) | 13.04.2023 @ 2PM |
| Badminton (Doubles) | 13.04.2023 @ 2PM | Throw Ball (7 members) | 15.04.2023 @ 2PM |
| 800M Walking | 13.04.2023 @ 2PM | Badminton ( Doubles) | 15.04.2023 @ 2PM |
| Shotput | 13.04.2023 @ 2PM | Musical Chair | 17.04.2023 @ 10AM |
| Carroms (Doubles) | 15.04.2023 @ 2PM | Shotput | 13.04.2023 @ 2PM |

For further information and registrations, the following persons may be contacted:

- Dr. K Bala Satyanarayana, Asst. Professor, Course Coordinator, Dept. of Physical Education, **Mobile 85001 14240** and
- Sri. V Solomon Devanand, Coach, Dept. of Physical Education

  **Mobil 9014011117**

(REGISTRAR)
Registrar
Adikavi Nannaya University
RAJAMAHENDRAVARAM-533 296

# బయోమెడికల్ అప్లికేషన్స్‌పై సదస్సు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం నందు,"రామన్ స్పెక్ట్రోస్కోపీని ఉపయోగించి బయోమెడికల్ ఇన్స్ట్రుమెంటేషన్స్ అండ్ అప్లికేషన్స్" పై ఒకరోజు కాన్ఫరెన్స్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ , ప్రొఫెసర్ కొట్టి శ్రీ రమేష్ ప్రారంభించి, కాన్ఫరెన్స్ లో పాల్గొన్నవారికి తన సందేశాన్ని అందించారు. ఈ సమావేశానికి రిసోర్స్ పర్సన్ ఢిల్లీ నేషనల్ ఫిజికల్ లాబొరేటరీ మాజీ సైంటిస్ట్ మరియు ఐఐఐటి కడప మాజీ డైరెక్టర్,



ప్రొఫెసర్ జి. భగవన్నారాయణ కీలకోపన్యాసాన్ని అందించారు. ఈ కాన్ఫరెన్స్ లో పెద్ద సంఖ్యలో రీసెర్చ్ స్కాలర్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఫార్మసీ విద్యార్థులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సదస్సులో ఫిజిక్స్ కోర్స్ కోఆర్డినేటర్ డా. ఎఫ్రాయిముబాబు, నిట్ ఆంధ్రప్రదేశ్ ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ అరుణకుమార్, నిట్ అధ్యాపకులు డాక్టర్ తోట నారాయణ, ఐఐఐటి నూజివీడు అధ్యాపకులు డాక్టర్ దుర్గాబాబు పాల్గొని ఉపన్యాసాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె వి ఎస్ ఎన్ రాజు, జి. సత్యనారాయణ, డాక్టర్ పట్టిసం వెంకట ప్రసాద్ పాల్గొన్నారు

# మహిళా చట్టాలకు... ఆద్యుడు అంబేద్కర్




భారత సమాజంలో స్త్రీలలో ఉన్న అవిద్య ,వెనుకబాటు స్థితి గురించి అంబేద్కర్ గారికి బాగా తెలుసు .
రాజకీయ , సామాజిక ఆర్థిక అసమానతలతో పాటు లింగ వివక్షత దేశాన్ని పట్టిపీడిస్తోందని స్త్రీ పురుష సమానత్వం మాత్రమే సమాజాన్ని అభివృద్ధి పదం వైపు నడిపించగలదని అంబేద్కర్ నమ్మారు.

పౌర హక్కులలో, ప్రజా కార్యక్రమాలలో స్త్రీ, పురుషులకు సమాన హక్కులు కల్పించడం మరో ముఖ్యమైన అంశము. 1951 ఫిబ్రవరి 5 న హిందూ కోడ్ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టబడినప్పుడు ప్రగతి కాముకులైన సభ్యులందరూ అంబేద్కర్ అతని కృషిని ప్రశంసిస్తూ"అభినవ మానవునిగా వర్ణించారు". ఉమ్మడి కుటుంబానికి చెందిన ఆస్తి లో స్త్రీలకు, పురుషులతో పాటు సమానమైన వాటా ఉండటం హిందూ కోడ్ బిల్ సవరణలో ప్రధానమైన అంశం.

అంబేద్కర్ అసమానతలను తరిమికొట్టేందుకు రాజ్యాంగ రచనకు ఒక సమున్నతావకాశంగా అంబేద్కర్ భావించారు. భారత రాజ్యాంగంలో మూడవ భాగంలో ఉన్న ప్రాథమిక హక్కులు అయిన సమానత్వపు హక్కులో నిబంధన 14 నుండి 16 వరకు స్త్రీ ,పురుష సమానాత్వంశాలను రాజ్యాంగంలో పొందుపరిచారు. స్త్రీల రక్షణకు ఉద్దేశించి అనేకమైన చట్టాలకు ఆద్యుడు అంబేద్కర్. భారత స్వాతంత్ర్య తొలి న్యాయ శాఖామంత్రి అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు ప్రవేశపెట్టిన హిందూ కోడ్ బిల్లులో వివాహం ,విడాకులు, సంపద హక్కులతో పాటు సంరక్షణ హక్కులకు హామీ ఇచ్చే హిందూ కోడ్ బిల్లుని ప్రవేశపెట్టడం ద్వారా మహిళల జీవితాల్లో విప్లవాత్మకమైన మార్పులను ఆశించారు .

"కొందరు చాందసులైన సభ్యులందరూ హిందూ కోడ్ బిల్లును వ్యతిరేకించారు. హిందూ కోడ్ బిల్లును యధాతథంగా పార్లమెంటులో అంగీకరించకపోతే తన ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేస్తానని నెహ్రూ గారు చెప్పారు. కానీ సర్దార్ వల్లభాయ్ పటేల్, రాజేంద్రప్రసాద్ లాంటి పెద్దలు బిల్లును వ్యతిరేకించడంతో నెహ్రూ తన అభిప్రాయాన్ని మార్చుకున్నారు." చివరకు అస్తిపంజరం లాంటి బిల్లు ఆమోదించబడింది. దీనిని తిరస్కరిస్తూ న్యాయశాఖ మంత్రి అయినా డాక్టర్ అంబేద్కర్ గారు న్యాయశాఖ మంత్రి పదవినే తృణప్రాయంగా వదిలివేయడం జరిగింది.

అసలు సిసలు స్త్రీవాది అంబేద్కర్ గారు. స్త్రీ జనోద్ధారణ కోసం అనేక చట్టాలను రూపకల్పన చేశారు. మేటర్నిటీ బెనిఫిట్ ఉమెన్ లేబర్ బిల్, ఈ చట్టం అమలుకు రావడంలో అంబేద్కర్ యొక్క పాత్ర చాలా కీలకమైనదిగా చెప్పవచ్చు. స్త్రీపురుష లింగ వ్యత్యాసాలు లేకుండా సమాన పనికి సమాన వేతనం, రిజిస్ట్రేషన్ ఆఫ్ బ్యాన్ ఆన్ ఉమెన్ వర్కింగ్ అండర్ గ్రౌండ్ మైన్స్, ఉమెన్ లేబర్ వెల్ఫేర్ ఫండ్, ఉమెన్ లేబర్ ప్రొటెక్షన్ యాక్ట్ మొదలగు వంటి చట్టాలకు అంబేద్కర్ ఆద్యుడు.

స్త్రీలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించి అంబేద్కర్ ప్రసాదించిన భారత రాజ్యాంగం ద్వారా స్త్రీలకు వెట్టి చాకిరి ,బానిస సంకెళ్ల నుంచి విముక్తి లభించింది. ఉన్నత వర్గాలకు వారికి మాత్రమే పరిమితమైన విద్య స్త్రీలకు మరియు అణగారిన వర్గాల ప్రజలకు వర్తింపజేయాలని చెప్పి విద్యచట్టాలను చేశారు. ధనవంతులకు, ఐశ్వర్యవంతులకు, భూస్వాములకు ,పురుషులకు మాత్రమే ఉన్న ఓటు హక్కును ఎటువంటి భేదము లేకుండా అందరూ సమానులే అనే భావనతో అన్ని వర్గాల ప్రజలకు ,స్త్రీలకు ఓటు హక్కును ప్రసాదించి రాజకీయ హక్కులకు పునాది వేసిన వ్యక్తి అంబేద్కర్. స్త్రీ చట్టాల రూపకల్పంలో అభినవ మానవునిగా వర్ణించవచ్చు.


స్త్రీ జనోద్ధరణుడు, స్త్రీ జనపక్షపాతి, అసలు సిసలు స్త్రీవాది, మహిళా చట్టాలకు ఆద్యుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు. ఈయన చేసిన కృషి మరియు చట్టాల ద్వారా ఎందరో స్త్రీలు స్వతంత్రులుగా ,విద్యావంతులై పై చదువులను చదివి అన్ని రంగాలలో కీలకపాత్రను వహిస్తున్నారు.

- ఏ.జె.ఎస్. దీప్తి.
ఎం.ఏ పొలిటికల్ సైన్స్, బి.ఎడ్.
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం
పూర్వ విద్యార్థి.

## కాకినాడలో జగ్జీవన్ రామ్ జయంతి



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ కాకినాడ నందు దళిత పితామహుడు కుల నిర్మూలన మరియు సమసమాజ మార్గ నిర్దేశకులు బాబు జగజ్జీవన్ రామ్ 116వ జయంతిని పురస్కరించుకొని క్యాంపస్ ప్రిన్సిపల్ డాక్టర్ కమల కుమారి ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం పోచయ్య, వి శ్రీనివాస్, హరిబాబు, రాధా మాధవి, హేమలత, రజిత, శ్రీనివాసరావు తదితర బోధన బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## జీవితం ఒక పుస్తకం అయితే?!

జీవితం ఒక పుస్తకం అయితే
ఎంత బాగుంటుంది
ముందు జరగబోయేవి తెలుసుకోవచ్చు
ఏమి సాధించగలనో,ఏమి చేయలేనో తెలుసుకోవచ్చు
జీవితం నిజానికి ఒక పుస్తకం అయితే....
నాకు నచ్చని పేజీలను చించి పారేస్తాను.
ఎందుకంటే అవి నాకు దుఃఖాన్ని,కన్నీళ్లను మాత్రమే మిగిలిస్తాయి
జీవితం నిజానికి ఒక పుస్తకం అయితే....
కొన్ని పేజీలను అతికిస్తాను.
ఎందుకంటే అవి నాకు సంతోషాన్ని,చిరునవ్వును కలిగిస్తాయి
జీవితం నిజానికి ఒక పుస్తకం అయితే....
నేను కాలాన్ని దొంగిలించి వెనక్కి పరిగెడతా
కూలిపోయిన నా స్వప్న సౌధాలను తిరిగి కట్టుకుంటా
తెగిపోయిన బంధాలను అతికించుకుంటా
కొన్ని క్షణాలను ఆనందంగా అనుభవిస్తా
జీవితం నిజానికి ఒక పుస్తకం అయితే....
నాకు నచ్చిన విధంగా నా జీవితాన్ని మలుచుకుంటా
జీవితం నిజానికి ఒక పుస్తకం అయితే....
గడిచిన కాలంలో పోగొట్టుకున్నవన్నీ తిరిగి సంపాదించుకుంటా
జీవితం నిజానికి ఒక పుస్తకం అయితే....
ఎంతో బాగుంటుంది కదా!!

- బి.సుశాంత్ కుమార్